సాక్షి గుంటూరు

మంగళవారం ; 20 ; ఆగస్టు ; 2024



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

మాచర్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. హోమం చేశారు.



వైభవంగా పౌర్ణమి పూజలు

రేపల్లె రూరల్: పవిత్ర శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని గ్రామదేవత బూరుగులమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యన్నదానానికి తెనాలిలోని చినరావూరు చెందిన జిట్టా విజయలక్ష్మి సోమవారం రూ. 1,00,001 అందించారు.

న్యూస్‌రీల్

జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్‌కు ముఖేష్ ఎంపిక



గుంటూరు వెస్ట్ (క్రీడలు) : పెరూ దేశంలోని లిమాలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు జరగనున్న జూనియర్ వరల్డ్ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌కు గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ ఎంపికయ్యాడని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ చీఫ్ కోచ్ ఎస్.సుబ్రమణ్యేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. ముఖేష్ సుదీర్ఘ కాలంగా ఇండియన్ రైఫిల్ షూటింగ్ క్యాంప్‌లో కొనసాగుతున్నాడన్నారు. స్థిరమైన ఆటతీరుతో పలు రాష్ట్ర, జాతీయ పతకాలు సాధించాడని వెల్లడించారు.

యార్డుకు 36,162 బస్తాల మిర్చి




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 36,162 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 33,928 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,800 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకానికి రూ. 4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 20,098 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సర్వర్ సమస్యతో పరుగో పరుగు



ప్రత్తిపాడు: సర్వర్ సమస్య అధికారుల్ని పక్క మండలాలకు పరుగులు పెట్టించింది. సోమవారం ఉదయం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, అనుబంధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ఆయా శాఖల అధికారులంతా కచ్చితంగా హాజరుకావాలని సూచించారు. దీంతో ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరానికి అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే సర్వర్ కనెక్ట్ కాకపోవడంతో సుమారు అరగంట గంటపాటు వేచి చూసిన అధికారులు ఇక లాభం లేదనుకుని వట్టిచెరుకూరు, గుంటూరు, పెదనందిపాడు మండలాలకు పరుగులు పెట్టారు. తీరా ఆఖరి పది నిమిషాల్లో ప్రత్తిపాడులో సర్వర్ కనెక్ట్ అవ్వడంతో ఉన్న పది మంది పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు వీడియో సమావేశాన్ని వీక్షించారు.

ఎండకు ఎర్రబడుతున్న వరి



తెనాలి: వేసవిని తలపిస్తున్న ఎండలతో వరి పొలాలు ఎర్రబడుతున్నాయి. ముఖ్యంగా చౌడు భూముల్లో ఎండ తీవ్రతకు నీరు ఆవిరై పోతోంది. నేలలోని లవణాలు పై పొరల్లో చేరడం వల్ల వరి మొక్కలు తేమను కోల్పోయి, ఆకులు ఎర్రబడుతున్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి సోమవారం మండల గ్రామాల్లో పర్యటించారు. వరి పైరును పరిశీలించారు. గుంటూరు జిల్లాలో దాదాపు 90 వేల ఎకరాల్లో వరిని వెదపద్ధతిలో సాగుచేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం 40-45 రోజుల దశలో ఉన్న పైరు అక్కడక్కడా ఎర్రబడిందని తెలిపారు. ముఖ్యంగా చౌడు భూముల్లోనే గమనించామని, వాటిల్లో నీరు తప్పనిసరిగా నిల్వకట్టి ఉంచాలని సలహానిచ్చారు. ఆకులు తెల్లబడినట్టయితే అన్నభేది లీటరు నీటికి 20 గ్రాములు, 20 గ్రాముల నిమ్మ ఉప్పును కలుపుకుని పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.ప్రేమసాగర్ పాల్గొన్నారు.



కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని డెమో రూపంలో ప్రదర్శిస్తున్న వైద్య విద్యార్థులు



వైద్య విద్యార్థులకు మై సేవియర్ అంటూ రాఖీలు కడుతున్న వైద్య విద్యార్థినులు

ప్రాణదాతల ఆక్రందన.. ఆవేదన

- ఏడో రోజుకు చేరిన జూడాల సమ్మె
- ఘనంగా రక్షా బంధన్ వేడుకలు
- ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉంటామంటూ స్కిట్ ప్రదర్శన

కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూడాలు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. సోమవారం రాఖీ పౌర్ణమి కూడా కావడంతో విద్యార్థినులు రక్షణగా ఉండాలని కోరుతూ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. ప్రజల ప్రాణాలు రక్షించే తమకు రక్షణ లేకుండా పోయిందంటూ ఆవేదన తెలుపుతూ లఘు నాటిక ప్రదర్శించారు. గుంటూరు జీజీహెచ్ నుంచి ఐటీసీ సమీపంలోని ఫినెక్స్‌మాల్ వరకు ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. ప్రజలందరికీ వైద్యుల బాధలు తెలియాలని, ప్రజల ప్రాణాలు రక్షించే క్రమంలో ఏ విధంగా ప్రాణాలు కోల్పోతున్నారనే విషయాలను తెలియజేస్తూ ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. నిందితుల్ని తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. వైద్యులపై, ఆసుపత్రి సిబ్బందిపై దాడులు జరగకుండా నివారించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ దీక్షిత్, డాక్టర్ అన్వర్ బాషా, డాక్టర్ రవి, డాక్టర్ అశ్విని, డాక్టర్ సరిత పాల్గొన్నారు.

– గుంటూరు మెడికల్

మొర వినండి.. మహాప్రభో!

- డీపీఓలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల గగ్గోలు
- అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్
- చట్ట పరిధిలో సమస్యల్ని పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశం



బాధితుల సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: సీఎం రిలీఫ్ ఫండ్, పెన్షన్ కోసం మెడికల్ బిల్లులు ఇవ్వమని అడిగితే తిరస్కరిస్తున్నారని ఓ తల్లి, ఆమె కుమార్తె.. ఇంట్లోంచి నలుగురు పిల్లల్ని తీసుకుని వెళ్లిపోవాలని కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ తల్లి వాపోయారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు ఫిర్యాదులు చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి బాధల్ని ఆయన ఆలకించారు. చట్ట పరిధిలో సమస్యల్ని పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సూచించారు. నిర్దేశించిన గడువులోగా పరిష్కరించి, న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఏఎస్పీలు జి.వి.రమణమూర్తి (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), ఎం.వెంకటేశ్వరరావు (సెబ్), డీఎస్పీలు సుబ్బారావు (మహిళా పీఎస్), శివాజీరాజు (సీసీఎస్) కూడా ఫిర్యాదులు స్వీకరించారు.

మెడికల్ బిల్లులు ఇవ్వడం లేదు



మా అమ్మ కోటపాటి లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునేది. అయితే, గతేడాది మా అన్నయ్య సురేష్ ఎడమ వైపు కిడ్నీ ఇవ్వగా గుంటూరు మణిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద నున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేశారు. రూ.15 లక్షలు ఖర్చు అయ్యాయి. దీనికి గానూ డొంక రోడ్డులో ఇల్లు అమ్మేశాం. శస్త్ర చికిత్సకు సంబంధించి మెడికల్ బిల్లులు ఇవ్వాలని ఆసుపత్రి వైద్యుల్ని పలుమార్లు అడిగినా కనికరించలేదు. నెలలు పాటు కాలయాపన చేశారు. బిల్లులు వస్తే సీఎం సహాయ నిధికి, కిడ్నీ వ్యాధికి సంబంధించి పెన్షన్‌కు దరఖాస్తు చేద్దామనే ప్రయత్నాలు ఫలించలేదు. గత నెలలో సీఎం చంద్రబాబుని కలిసి, బిల్లుల సమస్యను వివరించాం. ఆయన స్పందించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌ను కలవగా లెటర్ ఇచ్చారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్‌ను, డీఎంహెచ్‌ఓను కలిశాం. అక్కడ నుంచి జీజీహెచ్‌లో మరో ఉద్యోగికి రిఫర్ చేశారు. అయితే, సోమవారం ఉదయం కూడా ఆస్పత్రికి వెళ్లాం. సిబ్బందితో తమపై దాడి చేయించారు. అంతేగాక డొంక రోడ్డు నివాసి ఒకరు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. డాక్టర్ బిల్లులు ఇస్తే లక్షకు రూ.30 వేలు పన్ను చెల్లించాల్సి వస్తోందని, ఇచ్చే ప్రసక్తిలేదని చెబుతున్నారు. పెన్షన్‌కు దరఖాస్తు చేస్తే మా అమ్మ వైద్యసేవలు, మందులకు ఆసరాగా ఉంటుందని ఆశ. న్యాయం చేయాలి.

– యద్దపల్లి సునీత, (లక్ష్మి కుమార్తె), డొంక రోడ్డు

ఇంట్లోంచి వెళ్లిపోవాలని బెదిరింపులు



రెండున్నరేళ్ల కిందట భర్త గుండె పోటుతో చనిపోయారు. అత్తారింటిలో ఏడాదిపాటు బాగానే ఉన్నాం. ఇటీవల ముగ్గురు ఆడ పిల్లలు, అబ్బాబ్బాయి సహా ఇంటి నుంచి వెళ్లిపోవాలని అత్త, ఆమె తరఫు బంధువులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పిల్లల్ని చంపుతామని బెదిరిస్తున్నారు. ఇప్పటికే నలుగురు పిల్లల్ని కూలీ పనులు చేసుకుంటూ పోషించుకుంటున్నా.

– షేక్ దరియాబి, పేరేచర్ల

అద్దెకు ఇస్తే ఇంట్లో వీరంగం

యతిరాజుకాలనీ పదో వీధిలోని ఇంటిని అద్దెకిచ్చా. అద్దెకు ఉంటున్న ఆమె కుమారుడు రేయింబవళ్లు గంజాయి తాగడం, విక్రయించడంతో పాటు తాగుతున్నాడు. దీనిపై శనివారం రాత్రి అతన్ని అడిగాను. దీంతో అసభ్య పదజాలంతో నాతో పాటు నా కుమార్తెలను కూడా దూషించాడు. గతంలో ఒకసారి జైలుకి వెళ్లివచ్చానని, స్థానిక పోలీసులకు బాగా తెలుసునని బెదిరించాడు. నన్ను కాపాడాలి.

–ఓ మహిళ, యతిరాజు కాలనీ

ఉద్యోగం పేరిట మోసం

కొరిటిపాడులో ఉంటున్న తెలిసిన ఓ వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు అడిగాడు. దీంతో అప్పులు చేసి 2019లో రూ.4 లక్షలు చెల్లించా. ఉద్యోగం ఇప్పించలేదు. ఏడాది తర్వాత డబ్బులు చెల్లిస్తానని, ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ క్రమంలో అదే వ్యక్తి సోదరికి కూడా పెయింట్ వ్యాపారం నిమిత్తం మరో రూ.3 లక్షలను అదే ఏడాదిలో ఇచ్చా. ఇప్పటి వరకు చెల్లించలేదు. న్యాయం చేయగలరు.

– బి.కుమారి, నిడుబ్రోలు, పొన్నూరు మండలం

కొరిటిపాడులో ఉండే అదే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానంటే రూ.4 లక్షలు చెల్లించా. ఆన్‌లైన్‌లో శిక్షణ తరగతులు వేరొకరి ద్వారా ఇప్పిస్తామని నమ్మబలికాడు. దీంతో మోసమని గ్రహించి డబ్బులు అడిగితే గుంటూరులో చెల్లిస్తానని కాలయాపన చేశాడు. అదేమని అడిగితే తన బావ ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడని, డబ్బులు ఆయన వద్ద ఉన్నాయని చెబుతున్నాడు. గట్టిగా అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారు. న్యాయం చేయగలరు.

– ఉయ్యాల నాగరాజు, ధర్మవరం గ్రామం, బాపట్ల జిల్లా

టీడీపీకి ఓటు వేయలేదనే అక్కసుతో దాడి

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్త



నగరంపాలెం: టీడీపీకి ఓటు వేయలేదనే అక్కసుతో విచక్షణరహితంగా టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారని వట్టిచెరుకూరు మండలం గారపాడు ఎస్సీ కాలనీ (మాదిగ పల్లె) వాసి ఏసుపోగుల రవి వాపోయారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)లో ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఫిర్యాదు చేశారు. బాధితుడి ఆవేదన అతడి మాటల్లో.... ''నేను వైఎస్సార్ సీపీ కార్యకర్తను. వ్యవసాయ పనులకెళ్తా . గ్రామంలో కొందరు టీడీపీ నాయకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. వారు చెప్పుచేతుల్లోనే తమ పల్లెలో కొందరు నడుస్తున్నారు. మద్యం, డబ్బులు యిచ్చి దాడులు చేయించడం, బూతులు తిట్టించడంతో పాటు వేధింపులకు గురి చేస్తున్నారు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా వంద మందికి పైగా ఓట్లను అభ్యర్థించేందుకు ఇంటికి వచ్చారు. సైకిల్ గుర్తుకే ఓటేయాలని, లేకపోతే పల్లెలో ఉండేందుకు ఒప్పుకోమని హెచ్చరించారు. అందులో ఓ వ్యక్తి రూ.500 నోట్ల కట్ట తీసి, ఇవ్వగా తిరస్కరించా. దీంతో నా అంతు చూస్తానంటూ అక్కడ్నుంచి వెళ్లిపోయారు. ఇక ఎన్నికల ఫలితాలు వచ్చిన దగ్గర నుంచి అగ్రవర్ణాల కింద తమ పల్లెలో వారు ఉంటున్నారు. ఈ క్రమంలో తనపై దాడి చేసేందుకు పన్నాగం పన్నారు. జూన్ 22న పనికెళ్లి రాత్రి ఇంటికి నడిచి వెళ్తన్నాను. రావిచెట్టు సమీపాన కాళ్లు, చేతుల్తో పిడిగుద్దులు గుద్దారు. తమ పల్లెకు చెందిన నలుగురు ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బలమైన గాయాలయ్యాయి. దీంతో చంపుతున్నారంటూ బిగ్గరగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వచ్చేసరికి పారిపోయారు. చికిత్స అనంతరం ఇంటి వద్ద ఉంటున్నాను. స్థానికంగా పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదు. పల్లెలో ఉండలేకపోతున్నాం. తనపై దాడికి కారణమైన అగ్రవర్ణాల వారితో పాటు పల్లెలో కొందరి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరుతున్నాను''

ప్రజల అర్జీలకు సంపూర్ణ పరిష్కారం



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ

అధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం

గుంటూరు వెస్ట్: సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల అర్జీలను సంపూర్ణంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారుల్ని ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొన్ని అర్జీలు తూతూమంత్రంగా పరిష్కరించి మూసేస్తున్నారని, కొన్ని తన దృష్టికి వచ్చాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం ఒకేచోటకు చేరడం అంటే అర్థం చేసుకోవాలని అధికారులకు తెలిపారు. ఒకే అర్జీ పరిష్కారం కోసం పదేపదే తిప్పుకోకుండా చూడాలని తెలిపారు. పరిష్కారానికి అవకాశంలేని వాటిని వివరించి తెలపాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 140 ఫిర్యాదుల్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.

డబ్బులు తీసుకుని బెదిరిస్తున్నారు



2019లో మా బంధువులు అనిల్ కుమార్‌కు రూ.4 లక్షలు, సుధారాణికి రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చా. మొదట్లో ఇస్తాను అని నెమ్మదిగా చెప్పారు. ఇప్పుడు డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారు. అన్ని ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు కూడా చేశా. ఫలితం లేదు. న్యాయం చేయండి.

– బి.కుమారి, బీసీ సంఘం నాయకులు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై పిడుగు

- తొలగింపు నోటీసుల జారీ
- పనితీరు సంతృప్తికరంగా లేదని సాకు

తెనాలి: పట్టణ మున్సిపాలిటీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై పిడుగు పడింది. '15 రోజుల తర్వాత మీరు అందిస్తున్న సేవల నుంచి తొలగించటమైనది' అంటూ నోటీసులు జారీ చేశారు. పనితీరు సంతృప్తికరంగా లేదని, పనిభారం కూడా తగినంత లేకపోవడం, ఆర్థిక భారం తగ్గించుకోవాలని కారణాలతో తొలగిస్తున్నట్టు నోటీసుల్లో పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో 198 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉండగా, వీరిలో 85 మందికి ప్రస్తుతం నోటీసులు జారీచే శారు. మిగిలినవారికి దఫాలవారీగా అందుతాయని భావిస్తున్నారు.

కౌన్సిల్‌తో పనిలేకుండానే తొలగింపు

ఉద్యోగాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొనసాగించారు. ఖాళీలను మాత్రం భర్తీ చేసుకున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు భయపడినంతా జరిగింది. మున్సిపల్ కౌన్సిల్‌తో పనిలేకుండానే తొలగింపునకు రంగం సిద్ధమైంది. నోటీసులు అందుకున్న ఉద్యోగులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఇప్పుడేం చేయాలో? తెలియక సతమతమవుతున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రమే తొలగింపు నోటీసులు అందాయి. మిగిలిన ప్రభుత్వ విభాగాల్లోనూ నోటీసులనేవి సిద్ధంగా ఉంచుకున్నారని తెలుస్తోంది. ఆదేశాల ప్రకారం నడుచుకుంటారని సమాచారం. పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల స్థానంలో కొత్తగా ఉద్యోగుల భర్తీ దశాబ్దాలుగా లేని విషయం తెలిసిందే. వీరి స్థానంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని నియమించుకుని, వారితో విధులు చేయిస్తున్నారు. ప్రభుత్వ విభాగాలు తమ బడ్జెట్‌ను కాంట్రాక్టు సంస్థలకు ఇస్తుంటే, ఆ ప్రకారం ఆయా సంస్థలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తుండేవి. అందులో ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి పోను మరికొంత కమీషనును కాంట్రాక్టు సంస్థ నెలనెలా తీసుకుని, మిగిలిన జీతం ఉద్యోగికి ఇస్తుండేది.



నోటీసు

ఉద్యోగులకు కమిషనర్ ఇచ్చిన తొలగింపు నోటీసు

వైఎస్సార్ సీపీ పాలనలో ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేసింది. ప్రభుత్వ ఉద్యోగుల సంగతి ఎలాగున్నా, వీరికి మాత్రం ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు వచ్చేలా చూసింది. హాజరును జిల్లా కలెక్టర్ ద్వారా కార్పొరేషన్‌కు వెళుతుంటే వీరికి వేతనాలు క్రమం తప్పకుండా వస్తుండేవి. మధ్యలో ఎవరికీ ఎలాంటి కమీషన్లు ఉండేవి కావు. వీరికి ఉద్యోగ భద్రత కూడా ఉంది. నిర్దిష్టమైన ఆరోపణలు లేకుండా ఉద్యోగం నుంచి తొలగించడానికి అవకాశం లేకుండా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఉన్న కార్పొరేషన్‌ను రద్దు చేస్తారని భావిస్తున్నారు. అదే జరిగితే వీరి ఉద్యోగాలు పాత విధానంలోనే కాంట్రాక్టు సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటాయి.

వైభవంగా ఇంద్రగిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ సోమవారం కనులపండువగా సాగింది. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద దేవస్థాన ప్రచార రథంపై కొలువైఉన్న దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ కె.ఎస్.రామరావు, వైదిక కమిటీసభ్యుడు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఏఈఓ ఎన్.రమేష్ బాబు పూజలు చేసి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. కుమ్మరి పాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార జంక్షన్, కబేళా, పాలప్రాజెక్టు, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, కేటీ రోడ్డు, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి ఆలయానికి గిరి ప్రదక్షిణ చేరుకుంది.

డెల్టాకు 8,000 క్యూసెక్కులు విడుదల చేయాలి

సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు రైతుసంఘం వినతి



వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నేతలు

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాకు 8,000 క్యూసెక్కులు విడుదల చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, తెనాలి డివిజన్ కమిటీ సోమవారం సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేసింది. పెదవడ్లపూడి హైలెవెల్ చానల్‌కు రూ.3 కోట్లను కేటాయించడంతో పాటు 25 వేల ఎకరాల్లోని పంటలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు అయితానగర్ మహిళా పాడి రైతులకు ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించాలని, పశుగ్రాసం కొనుగోలు నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ హామీనిచ్చారు. 2023–24లో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు రావాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీని ఇప్పించాలని కోరారు. కొల్లిపర మండలం వల్లపాపురంలోని జాయింట్ లైబిలిటీ మహి గ్రూపుకి రూ.5 లక్షలకు మరొక రూ.50 వేల రుణ సదుపాయం కల్పించి ఆ గ్రూపుకి ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరినట్టు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి చెప్పారు. మహిళా పాడి రైతు సంఘం నాయకురాలు వేజెండ్ల తబిత మాట్లాడుతూ పశుపోషణ భారంగా మారినందున ప్రభుత్వరంగ సంస్థలు రైతులకు రుణాలు మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో మాన్యం శ్యాంబాబు, మేకల అనసూయ, ఈపూరి బేబీరాణి మేకల ధనమ్మ, గొరికపూడి అరుణ, సునీత, తెనాలి నిర్మల, పద్మ, కూచిపూడి శకుంతల, తోట సరోజిని, వేజెండ్ల వజ్రమ్మ, తెనాలి ఝాన్సీ పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి

కలెక్టర్ నాగలక్ష్మి



జిల్లా అధికారులతో వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఈనెల 23 నుంచి జరగనున్న గ్రామసభల్ని అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి సోమవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి గ్రామంలో టాంటాం వేయించడం, సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించడం ద్వారా గ్రామ సభల సమాచారాన్ని అందరికీ అందించాలని ఆదేశించారు. సభలు విజయవంతం కావడానికి అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోడంతోపాటు, సంబంధిత రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటాలని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వేగవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేలా విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉందని, దాన్ని పెంచాలని తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం దరఖాస్తుల్ని అధికారులు వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా, సీజనల్ వ్యాధులు రాకుండా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యాధులు కొన్ని గ్రామాల్లో అధికంగా నమోదవుతున్నాయని, వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. గ్రామీణ, పట్టణప్రాంతాల్లో మంచినీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాల పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో కౌలు రైతులకు పంట రుణాలతోపాటు, ప్రభుత్వం అందించే ఇతర రాయితీల కోసం సీసీఆర్సీ కార్డులు మంజూరయ్యేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. వచ్చేనెల 15 నాటికి ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, అసిస్టెంట్ కలెక్టర్ ఎ.పవార్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు బహుమతుల పంపిణీ

ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఈ నెల 8 నుంచి 10 వరకు విద్యార్థులకు జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించింది.
విజేతలకు సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ జగన్నాథ్, అధికారులు నగదు బహుమతులు అందజేసారు.

దివ్యాంగుడికి రూ.50 వేల రుణం

తెనాలికి చెందిన మల్లికార్జుననాయుడు స్వామి, భార్యకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రూ.50 వేల బ్యాంకు రుణాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిర ఆవరణలో అందజేశారు. ఈ మొత్తంతో భార్యభర్తలు స్వయం ఉపాధి కింద స్టీలు సామాను కొట్టు పెట్టుకుని జీవిస్తారని తెలిపారు.

హకీం జానీకి యువకళా వాహిని పురస్కారం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజానికి ప్రతిష్టాత్మకమైన యువకళా వాహిని పురస్కారం లభించింది. రచయిత విభాగంలో అమరావతి తెలుగు వెలుగులు పేరుతో ఈ నెల 23న గుంటూరులో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.మల్లికార్జునరావు ఈ మేరకు సమాచారం పంపారు. ఆరోజు సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య కళావేదికపై జరిగే కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి ఈ పురస్కారాన్ని హకీంజానీకి అందజేస్తారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న హకీంజాని 33 ఏళ్లగా సాహితీ సేద్యంలో 72 పుస్తకాలు, 1500 వ్యాసాలు, బాలల కోసం 285 కథలు రాశారు. వీరి పిల్లల కథలు రెండింటిని మహారాష్ట్రలోని పాఠ్య పుస్తకాల్లో చేర్చారు. పలు అవార్డులను అందుకున్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారంతోపాటు ప్రభుత్వం నుంచి రెండుసార్లు పర్యాటకశాఖ ఉత్తమ జర్నలిస్ట్ బహుమతినీ, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్నీ అందుకున్నారు.

జీజీహెచ్‌లో పటిష్ట భద్రత చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్‌తేజ్

జేసీ భార్గవ్‌తేజ్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పక్కా ప్రణాళికతో రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్ తెలిపారు. ఆసుపత్రి శుశృత హాలులో సోమవారం పటిష్ట బందోబస్తుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రహరీ గోడకు ఆనుకుని వ్యాపారాలు చేస్తున్న వారి గురించి నగరపాలక సంస్థ కమిషనర్‌తో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. పోలీసు, నగర పాలకసంస్థ అధికారులతో చర్చి ప్రణాళిక ప్రకారం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీని ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళతామని చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలాన్ని చీకటి ప్రాంతాల్లో జరుగుతున్నాయని తెలిపారు. నగర పరిధిలో పలుచోట్ల విద్యుత్ సౌకర్యాన్ని, సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల చీకటి వ్యాపారాన్ని అడ్డుకోవచ్చని సూచించారు. ఇలాంటి ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో పర్యవేక్షణ చేస్తున్నారని, అనుమానితులు కనపడితే అదుపులో తీసుకుని విచారిస్తున్నామని చెప్పారు. సదరం సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో వైద్యులకు రక్షణ కల్పిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో ప్రధాన విభాగల వద్ద కూడా రక్షణ కల్పిస్తామన్నారు. పోలీసు శాఖతో పాటు అన్నీ శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. త్వరలో మెడికల్ శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా రాత్రి సమయంలో అసాంఘిక శక్తులు ఆసుపత్రిలో చొరబడుతున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై మరింతగా నిఘా పెంచాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.పవార్ జగన్నాథ్, ఆర్డీఓ శ్రీకర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డి పాల్గొన్నారు.

నార్త్ జోన్ డీఎస్పీగా మురళీకృష్ణ

మంగళగిరి: నార్త్ జోన్ డీఎస్పీగా మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో రాజకీయాలకు అతీతంగా పని చేస్తానని తెలిపారు. ముఖ్యంగా రాజధాని ప్రాంతం కావడంతో నిరంతరం నిఘాతో పాటు భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా స్టేషన్ల పరిధిలో సిబ్బంది కొరతపై స్థానిక సీఐలతో నివేదికలు తెప్పించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నియామకాలకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయనకు పట్టణ, రూరల్ సీఐలు వినోద్ కుమార్, శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5800, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.7000 వరకు పలికింది.

ఆగమ శాస్త్రాలలో 'వైఖానస' శ్రేష్ఠం

టీటీడీ ఆగమ అధ్యాపకుడు ఫణికుమార్



ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదుతో ఫణికుమార్‌కు సత్కారం

తెనాలి: ఆగమ శాస్త్రాల్లో వైఖానస ఆగమ శాస్త్రం శ్రేష్ఠమైనదని తిరుమల తిరుపతి దేవస్థానాల శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ధర్మగిరి అధ్యాపకుడు దీవి ఫణికుమార్ అన్నారు. శ్రీ వైఖానస సేవా సంఘం, తెనాలి ఆధ్వర్యంలో విఖనస జయంతి రోజైన సోమవారం పట్టణంలోని గోవర్ధనస్వామి దేవస్థానంలో కొలువైన విఖనసాచార్య స్వామి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన పంచామృత స్నపన, విశేష అర్చన జరిపి బ్రహ్మోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటైన సభకు సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడూరు శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఫణికుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, నైమిశారణ్యంలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువే విఖనస మహామునిగా ఉద్భవించారని తెలిపారు. ఆయన ప్రధానమైన తొమ్మిది మంది రుషుల ద్వారా ఆగమ శాస్త్రాన్ని ప్రపంచానికి అందించారని చెప్పారు. వైదిక మార్గంలో భగవంతుని చేరవచ్చు అనేందుకు భగవదర్చన క్రియను కూడా అందించిన మహర్షి విఖనసుడని వివరించారు. సభాధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ వైఖానస ఆగమ శాస్త్రాన్ని, విఖనస మహాముని విశిష్టతను దశదిశలా వ్యాపింప చేసేందుకు వైఖానసులు కృషి చేయాలని సూచించారు. సేవాసంఘం నిర్వహిస్తున్న ధార్మిక, సేవలను వివరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు దీవి లక్ష్మీనరసింహాచార్యులు, ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.రఘు, కోశాధికారి యోగానంద చక్రవర్తి, పండిత వీఎల్ఎన్‌డీ భట్టాచార్యులు, నారాయణం రంగాచార్యులు, నారాయణం వేణుగోపాల్, ఆలయ కార్యనిర్వహణ అధికారిణి ఎన్‌వీఎస్ మల్లేశ్వరి, టీటీడీ భజన మండలి కన్వీనర్ రొంపిచర్ల కిరణ్‌కుమార్ మాట్లాడారు. దివి అంజనీకుమార్, వేదాంతం నాగమారుతి వేద పారాయణ చేశారు

ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదు ప్రదానం

సేవాసంఘం ఆధ్వర్యంలో పండిత దీవి ఫణికుమార్ కు ఆగమ ప్రజ్ఞా విశారద బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని అగ్నిహోత్రం సనత్ కుమార్, అగ్నిహోత్రం శ్రీనివాస దీక్షితులు, రొంపిచర్ల శేషసాయి పర్యవేక్షించారు. రొంపిచర్ల లక్ష్మీనరసింహాచార్యులు, రాజ్యలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు అగ్నిహోత్రం నరసింహమూర్తిని అర్చక పురస్కారంతో సన్మానించారు. ఆగమ విద్యార్థులు నారాయణం సంతోష్, వేదాంతం కమలేష్‌కు ఆగమ విద్యార్థి పురస్కారాన్ని అందించారు. నారాయణం రంగాచార్యులు పర్యవేక్షణలో ఆచార్య స్వామి రథోత్సవం నిర్వహించారు.

క్రమశిక్షణ, సంపూర్ణ విద్య వీవీఐటీ నినాదం



వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: విద్యార్థులకు క్రమశిక్షణ, సంపూర్ణ విద్య వీవీఐటీ నినాదం అని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. అధునాతన సాంకేతిక విద్య, ఉపాధి, నైపుణ్యాలతోపాటు మంచి అనుభూతులు, జ్ఞాపకాలను అందిస్తుందని తెలిపారు. నంబూరు వీవీఐటీ కళాశాలలో సోమవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతుల్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లడుతూ కళాశాలలోని మౌలిక వసతులతో పాటు సీమన్స్ ఎక్సలెన్స్, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం వల్ల విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాల్ని సంపాదించుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేందుకు, వారిలో విలువల్ని పెంపొందించేందుకు వీవీఐటీ దోహదపడుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలని చెప్పారు. విద్యతోపాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందేందుకు వీవీఐటీ చక్కటి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్లేస్‌మెంటు డీన్ డాక్టర్ ఎం. రఘురామ్ మాట్లడుతూ మెరుగైన విద్యను నైపుణ్యంగా మార్చి విలువల కోసం పనిచేసే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. ముందుగా ఈఏపీ సెట్‌లో టాప్ ర్యాంకర్లగా నిలిచి, కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరి సూర్యదేవర బదరీప్రసాద్, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు, విభాగాధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్య, వికాసం సంతోషంగా సాగాలి



తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లావు రత్తయ్య

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- విజ్ఞాన్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో బీటెక్ తరగతులు ప్రారంభం

చేబ్రోలు: విద్యార్థుల్లో విజ్ఞానం, వికాసం, చదువు, అభివృద్ధి అనేవి సంతోషంగా జరగాల్సిన ప్రక్రియలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామంలోని రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద గల విజ్ఞాన్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్– హైదరాబాద్‌లో సోమవారం నుంచి బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతుల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లావు రత్తయ్య మాట్లాడుతూ అన్ని కేంద్ర ప్రభుత్వ అనుమతులతో ఈ సంవత్సరమే నూతనంగా ప్రారంభించిన విజ్ఞాన్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విద్యార్థుల్ని చేర్పించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లో ఇప్పుడే కొత్తగా ప్రారంభించామని, తల్లిదండ్రులు ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని చెప్పారు. విద్యార్థుల్ని సంపూర్ణంగా తీర్చిదిద్దడంతో పాటు జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించి, మంచి ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే గుంటూరులో విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పంచ సూత్రాల (1.ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, 2.ప్లానింగ్, ట్రెనింగ్, కమ్యూనికేషన్ సిస్టమ్, 3.కౌన్సిలింగ్ సిస్టం , 4.సీఆర్‌టీ తరగతులు, 5.బోధన పద్ధతి) వల్లే తమ దగ్గర చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ పూనం మాలకొండయ్యను క్యాంపస్ అడ్వైజర్‌గా నియమించినట్లు వెల్లడించారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులు పరీక్షలు రాయడానికే మాత్రమే ప్రిపేర్ అయ్యేంటారని, ఇప్పటి నుంచి మాత్రం జీవితంలో నెగ్గడానికి ప్రిపేర్ అవ్వాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీలో పనిచేసే అధ్యాపకులు టెక్నాలజీలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం వల్ల నూరు శాతం ఫలితాలను సాధిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ బోయపాటి రుద్రమదేవి, వైస్ చాన్స్‌లర్ పి. నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, తల్లిదండ్రులు, అధ్యాపక సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాన్ని కదిలించేది.. మానవత్వాన్ని చాటేది ఫొటోగ్రఫీ

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్



చక్రపాణికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, వీసీ తదితరులు

ఏఎన్‌యూ: సమాజాన్ని కదిలించేది.. మానవత్వాన్ని చాటేది ఫొటోగ్రఫీ అని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఫొటోగ్రఫీని శాస్త్రంగా గుర్తించి నేడు ప్రత్యేక కోర్సుగా తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిప్లొమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫోటోలు తీయడం ఒక ఎత్తయితే, దాన్ని ప్రింట్ చేయడం సవాలతో కూడుకున్న పని అన్నారు. నేడు సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందిన తరుణంలో ఒక్క నిమిషంలోనే ప్రింట్ వస్తోందన్నారు. సమాజంలోని సంఘటనల గుర్తింపునకు ఫొటోగ్రఫీ అస్త్రంగా పని చేస్తుందని తెలిపారు. కొన్నిఫోటోలు విప్లవానికి కూడా దారితీస్తాయని చెప్పారు.
ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు మాట్లాడుతూ ఫొటోగ్రఫీతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్. స్వరూపరాణి మాట్లాడుతూ చదవలేని పుస్తకంగా రాయలేని కవితగా ఫొటోగ్రఫీ నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు దాసోహం అయ్యేది ఫొటోకు మాత్రమేనని పేర్కొన్నారు. పోటీలకు వచ్చిన 800 పైగా ఎంట్రీలను పరిశీలించి అందులో ఉత్తమమైన ఫొటోలను ఎంపిక చేసి విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి సీనియర్ ఫొటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ అనిత, జర్నలిజం విభాగ అధ్యాపకులు డాక్టర్ జ్యోతిర్మయి, డాక్టర్ మధుబాబు పాల్గొన్నారు.

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు అవార్డు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఫొటోగ్రాఫర్ (విజయవాడ) కె.చక్రపాణికి అప్రిషియేషన్ అవార్డు లభించింది. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, వీసీ ఆచార్య కె.గంగాధరరావు తదితరులు చక్రపాణికి అవార్డు అందజేశారు. ఈయనతో పాటు పలువురు ఫొటోగ్రాఫర్‌లకు అతిథులు అవార్డులు అందజేశారు.

పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య


విజయపురిసౌత్: పెట్రోల్ పోసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన విజయపురిసౌత్‌లోని కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ పక్కన ఉన్న పాత లేక్ వ్యూ గెస్ట్‌హౌస్ ఆవరణలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి ఆదివారం రాత్రి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు సాగర్‌మాత గుడి వద్ద అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో పలువురికి కనిపించినట్లు తెలిసింది. మృతదేహం వద్ద ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లో కాషాయ రంగు టవల్, రెండు వాటర్ బాటిల్స్, రెండు బీడీ కట్టలు, ఒక అగ్గి పెట్టె ఉన్నాయి. మృతుడు యాచకుడని పోలీసులు భావిస్తున్నారు. గురజాల ఇన్‌చార్జి డీఎస్పీ గురనాథ్‌బాబు, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య ఘటన మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయపురిసౌత్ ఎస్ఐ పట్టాభిరామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో మునిగి మహిళ ఆత్మహత్యాయత్నం

బాపట్లటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన చందోలు లక్ష్మి కుటుంబ కలహాల నేపథ్యంలో ఉదయం సూర్యలంక సముద్రతీరానికి చేరుకుంది. మధ్యాహ్నం సముద్రంలో లోతుకు వెళ్లి మునిగి ఆత్మహత్య చేసుకోవాలని భావించింది. పోలీసులు మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా హెచ్చరిస్తున్నప్పటికీ సముద్రంలో ఇంకా లోతుకు వెళుతూ మునిగిపోసాగింది. ఈ విషయాన్ని గమనించిన గజ ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై వెంటనే సముద్రంలోకి వెళ్లి ఆమె కాపాడి తీరానికి తీసుకువచ్చారు. అనంతరం రూరల్ సీఐ గంగాధరరావు మహిళకు కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు. మహిళను కాపాడిన సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

ప్రకాశం జట్టుపై గుంటూరు ఘనవిజయం

- 10 వికెట్ల తేడాతో గుంటూరు విజయం
- గుంటూరు జట్టుకు ఏడు పాయింట్లు



సిద్ధూ (4 వికెట్లు) గుంటూరు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ పోటీలలో ప్రకాశం జిల్లా జట్టుపై గుంటూరు జట్టు ఘన విజయం సాధించింది. మూడు రోజులపాటు జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి 10 వికెట్ల తేడాతో ప్రకాశం జట్టును చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకు కట్టడి చేసిన గుంటూరు జట్టు 390 సాధించి 115 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ప్రకాశం జట్టు ఆదివారం నాటి రెండు వికెట్లు నష్టానికి 44 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో సోమవారం బ్యాటింగ్ ప్రారంభించి రెండో ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని పి.నందకిషోర్ 49 పరుగులు సాధించి పరుగు తేడాతో అర్ధ సెంచరీ మిస్ అయ్యాడు. గుంటూరు బౌలర్ సిద్ధూ 15 ఓవర్లలో 53 పరుగులు ఇచ్చి 4 వికెట్లు, వీపీఎస్ రెడ్డి 13 ఓవర్లలో 33 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం 80 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు 15.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. గుంటూరు బ్యాట్స్‌మెన్‌లు కె.ఎల్.శ్రీనివాస్ 44, రోనే 36 పరుగులు సాధించారు. భారీ విజయం సాధించిన గుంటూరు జట్టుకు ఏడు పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీ తాపతిరావు పర్యవేక్షించారు.